క్లుప్తంగా

అయ్యప్పస్వామికి అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని బుధవారం 21 రకాల అభిషేకం, 21 కిలోల నెయ్యితో ఆలయ అర్చకులు కర్నె అశోక్ శర్మ అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం నిత్య అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి



పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

సుల్తానాబాద్: పరిశుభ్రతపై పారిశుధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న పూసాలలో మున్సిపల్ కార్మికులతో పారిశుధ్య పనులను చేయించారు. ప్రజలు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని ఆయన కోరారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్త వేయడంతో దుర్వాసన వస్తుందని ట్రాక్టర్ వచ్చినప్పుడే అందులో వేయాలని ప్రజలను కోరారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్ అందిస్తున్న రాయగట్టు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ మాజీ ఉప సర్పంచ్ కీర్తి రాయగట్టు బుధవారం మైక్‌సెట్ బహూకరించారు. తన తండ్రి వెంకటయ్య జ్ఞాపకార్థం రూ.8400 విలువగల సౌండ్‌సిస్టం అందించినట్లు ఆయన తెలిపారు. మైక్‌సెట్ అందించినందుకు పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సదయ్య, వెంకటేశ్వర్లు, సంతోష్, అరుణ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

పాలకుర్తి: ఉమ్మడి రామగుండం మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఈనెల 8వ తేదీ శుక్రవారం సదస్సు నిర్వహించనున్నట్లు పాలకుర్తి మండల ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరుమార్పు, కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు మొదలగు వాటికి సంబంధించి విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు స్వీకరిస్తారని ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్లన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లిస్తున్న నాయకులు

ఓదెల: పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతకుంట విజయరమణరావు గెలిచినందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొర్ల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు తెమ్మెడబోయిన ఓదెలుయాదవ్ ఆధ్వర్యంలో ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో కోడెమొక్కులు చెల్లించుకొని మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, ఖండేలరాయులు, నందీశ్వరుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్యయాదవ్, యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందనవేని రాజేందర్‌యాదవ్, సర్పంచుల ఫోరం జూలపల్లి మండల అధ్యక్షుడు దరవేని నర్సింహయాదవ్, నాయకులు జంగం కొమురయ్య, ఆవుల మల్లేశ్, కృష్ణయాదవ్, రాములు పాల్గొన్నారు.

పొద్దంతా చిరుజల్లులు, ఈదురుగాలులు

- వదలని ముసురు వాన
- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు
- కొనుగోళ్లలో వేగం పెంచాలని అన్నదాత వేడుకోలు



ఎలిగేడులో చిరుజల్లుల వాన

సుల్తానాబాద్: మిచాంగ్ తుపాన్‌తో జిల్లాలో పొద్దంతా ఈదురుగాలులు, చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ప్రజలు, రైతులు, వ్యాపారులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చివరి దశకు రావడంతో కల్లాల్లోనే వరి ధాన్యం ఉండడంతో రైతులు అప్రమత్తమయ్యారు. స్థానిక అధికారులు రైతులను అప్రమత్తం చేయడమే కాకుండా టార్పాలిన్‌లు అందించారు. దీంతో పెద్దగా నష్టం వాటిల్లలేదని అధికారులు చెప్తున్నారు.

షెడ్డుకు ధాన్యం తరలింపు..

సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు చివరి దశకు రావడంతో కొద్దిపాటి వరిధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు వాటిని పక్కనే ఉన్న షెడ్డుకు తరలిస్తున్నారు. కొందరు రైతులు టార్పాలిన్ కప్పుకొని తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. వాతావరణశాఖ ప్రకారం మరో రోజు వర్షం ఉండడంతో పత్తి దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. చేతికి వచ్చిన పంట రంగు మారితే ధర తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దుబ్బపల్లి నుంచే వర్షం..

కరీంనగర్ జిల్లా సరిహద్దు ప్రాంతపైన దుబ్బపల్లి నుంచే వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెపుతున్నారు. పలు ప్రాంతాల్లో వరిధాన్యం కేంద్రాలతో పాటు కల్లాల వద్ద ఉండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

వదలని వాన ముసురు

జూలపల్లి: తుపాన్ ప్రభావంతో మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వాన ముసురు బుధవారం కొనసాగింది. చలి గాలులతో చినుకులు పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులు, వ్యవసాయకూలీల పనులు సాగలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలపై రైతులు టార్పాలిన్లు కప్పారు.

ఎలిగేడులో తుంపర వర్షం

ఎలిగేడు: మండలంలో బుధవారం కారుమబ్బులు కమ్ముకుని చీకటిమయమై తుంపర వర్షం పడింది. ఈ తుంపర చినుకులతో మండలంలోని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరిధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు పరదాలు కప్పి ఉంచారు. భారీ వర్షం వస్తే ధాన్యం తడిసి ముద్దవుతుందని, తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే అధికారులు ధాన్యం తూకం వేసి మిల్లులకు పంపించాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం

ఫెర్టిలైజర్‌సిటీ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాలకుర్తి మండలం గుంటురుపల్లి, ఎల్కలపల్లి ఐకేపీ ధాన్యం కేంద్రాల్లో బుధవారం ధాన్యం తడిసింది. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడంతో అకాలంగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షం కురిసే సమయంలో ధాన్యం రైతులకు టార్పాలిన్ అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



సుల్తానాబాద్ మార్కెట్లో..



జూలపల్లి: కాచాపూర్‌లో..



ఫెర్టిలైజర్‌సిటీ: కొనుగోలు కేంద్రంలో ధాన్యం

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



గోదావరిఖనిటౌన్: మాట్లాడుతున్న పోలీసులు



ధర్మారం: అవగాహన కల్పిస్తున్న ఎస్సై

గోదావరిఖనిటౌన్: జాగరూకత దివస్ సందర్భంగా గోదావరిఖని రమేశ్‌నగర్‌లోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ మహేందర్, రామగుండం క్రైమ్ సీఐ రహీం పాషా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల రకాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల నియంత్రణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేక అధికారులను నియమించిందని తెలిపారు. ఎవరైనా సైబర్ క్రైం బారిన పడిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కటికెనపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై స్థానిక ఎస్సై సత్యనారాయణ అవగాహన కల్పించారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ లాంటి నంబర్లు అడిగితే ఎట్టి పరిస్థితిలో చెప్పరాదన్నారు. అంతేకాకుండా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి తమ వ్యక్తిగత డాటా అడిగితే సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఫేక్ బ్యాంక్ కాల్స్, కొరియర్ ఫ్రాడ్స్‌తో పాటు ఇతర సైబర్ నేరాల తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్: రాష్ట్రాన్ని ప్రకటించిన సోనియమ్మకు ప్రజలు అండగా నిలుస్తారని పాత తాలూకా చైర్మన్ దామోదర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డిని ప్రకటించడం పార్టీ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన భావించారు. పార్టీకి అండగా నిలిచిన వారికి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రకాష్‌రావు, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, మండల అధ్యక్షుడు సతీశ్‌కుమార్, కిషోర్, అమిరిశెట్టి రాజలింగు, తిరుపతి, ప్రభాకర్, రామన్న, మహేందర్, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మేడి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎలిగేడులో కాంగ్రెస్ సంబరాలు

ఎలిగేడు: రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించడం, కాంగ్రెస్ అధిష్టానం సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన చింతకుంట విజయరమణారావు, రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సర్పంచులు సింధూజ, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు భూర్ల వెంకటసత్యం, అమ్ముల శ్రీనివాస్‌యాదవ్, అమ్ముల రమేశ్, మనోహర్‌రావు, మామిడాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మొక్కులు



కొబ్బరికాయలు కొడుతున్న ఉమ

మంథని: మండలంలోని కన్నాల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన చిదురాల ఉమ 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయి.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు భారీ మెజార్టీలో గెలుపొందాలని ఎన్నికలకు ముందు మొక్కుకున్నట్లు ఉమ తెలిపారు. సర్పంచ్ చిదురాల మంగ, నాయకులు దామోదర్, పోయిల రాజయ్య, తోకల మల్లేశ్, కావటి సందీప్, తోకల సిద్ధు, మనీ, చింటు ఉన్నారు.

ఆలయంలో జ్ఞానయజ్ఞ పారాయణం



పారాయణంలో శ్రీసత్యనారాయణశర్మ

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో దేవీ భాగవత నామ జ్ఞానయజ్ఞ పురాణం బుధవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా దేవీ భాగవతా సప్తాహ పురాణంలో ప్రతీరోజు శ్రీమారుపాక సత్యనారాయణశర్మ వివిధ అంశాలపై శాస్త్రోక్తమైన అంశాలను భక్తులను వివరిస్తున్నారు. ఈ నెల 10వ తేదీతో కార్యక్రమం ముగుస్తుంది. కార్యక్రమంలో నిర్వాహకులు కౌశిక వెంకటరమణ, దొంతుల మాధవి ఉన్నారు.

జీపీల రిజర్వేషన్ల వివరాలు సమర్పించండి

- మండల పరిషత్‌లకు ఆదేశాలు



అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం

రామగుండం: సర్పంచుల పదవీకాలం జనవరి31, 2024న ముగియనుండడంతో గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, ఉప సర్పంచుల రిజర్వేషన్ల వివరాలను సమర్పించాలని ఉన్నతాధికారులు మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రెండు రోజుల్లో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కి వివరాలు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2006, 2013, 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన సర్పంచులు, వార్డు సభ్యులు, ఉప సర్పంచుల రిజర్వేషన్ల వివరాలను సమర్పించాలన్నారు.. మూడు టర్మ్‌లలో జరిగిన ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్ల వివరాలను నివేదిక రూపంలో సమర్పించనున్నట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

అంబేడ్కర్ జాతీయ రహదారి నిర్మించండి

మంథని: రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేడ్కర్ స్మారక జాతీయ రహదారి ముంబై వయా మంథని మీదుగా వైజాగ్ వరకు సత్వరమే నిర్మించాలని విద్యార్థి యువత వ్యవస్థాపకుడు కొండేల మారుతి కోరారు. బుధవారం విద్యార్థి యువత కార్యాలయంలో మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దాడులు చేయడం సరికాదు



షాపును పరిశీలిస్తున్న లింగమూర్తి

సుల్తానాబాద్: ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఏ పార్టీకోసమైనా పని చేయొచ్చని, ఇలా కక్షతో షాపులపై దాడి చేయడం సరికాదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంకటి లింగమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీశివసాయి డిజిటల్ లాబొరేటరీపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేయడం సరికాదని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకత్వంపై ఉందన్నారు. దోషులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట షాప్ యజమాని పూసాల రామకృష్ణ ఉన్నారు. ఇటీవల షాప్‌పై దాడి చేయగా ఇరువురుపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కిషోర్‌కుమార్

రామగుండం: ఆర్థికపరమైన అంశాలపై ఖాతాదారులు వ్యవహరించాల్సిన విధి విధానాలపై బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఖాతాదారులను ఉద్దేశించి బ్యాంకు మేనేజర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు తీసుకున్న రుణాలకు సకాలంలో వాయిదాలు చెల్లించడంతో వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల కాలపరిమితి ముగియగానే తిరిగి వాటిని రెన్యూవల్‌లో భాగంగా నిర్దేశిత కాలానికి మళ్లీ ఫిక్స్ చేయాలని సూచించారు. పొదుపు చర్యలు పాటించడంతో బ్యాంకు ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా మహిళా స్వశక్తి సంఘాల గ్రూపు సభ్యులు తమ వాయిదా చెల్లింపులను నిర్దేశిత కాలంలో చెల్లించినప్పుడే బ్యాంకు సదరు ఖాతాదారుపై నమ్మకం కుదురుతుందని, ఫలితంగా అవసరమున్న సమయంలో సత్వరమే రుణాల మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. అవగాహన సదస్సులో బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్ బి.కృష్ణమూర్తి, క్యాషియర్ హరిబాబు, మేనేజర్ నడిగొట్టు నరేశ్, బ్యాంకు ఖాతాదారులు హాజరయ్యారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



జ్యోతినగర్: అసోసియేషన్ సభ్యులు



సుల్తానాబాద్‌లో..



ఎలిగేడులో నివాళి అర్పిస్తున్న నాయకులు



రామగుండం: జెన్‌కో ఉద్యోగులు

సుల్తానాబాద్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాతరి ప్రభాకర్ కోరారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సుల్తానాబాద్‌లోని విగ్రహానికి పూలమాల వేశారు.

జ్యోతినగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎన్టీపీసీ రామగుండం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం పెద్దపెల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

రామగుండం: రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

జూలపల్లి: ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి, తహసీల్దార్ కార్యాలయంలో డ చిత్రపటానికి జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జాహెద్‌పాషా నివాళి అర్పించారు. మల్యాలలో మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య నివాళి అర్పించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో సర్పంచ్ లావణ్య నివాళి అర్పించారు.

మంథని: మంథని డివిజన్‌లో మంథని కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

రామగిరి: సెంటినరీకాలనీలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోచం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

గోదావరిఖనిటౌన్: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జీడీ కనుకయ్య, అధ్యాపకులు శైలజ, కళారాధ, శారద, స్వప్న, భాగ్యలక్ష్మి, రమాదేవి, రాణి, ప్రియదర్శిని, అనూష పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం



అన్నదానంలో అయ్యప్పస్వాములు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయ సముదాయంలో ఉన్న అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు మాల వితరణ చేసేంత వరకు ప్రతీరోజు మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు అయ్యప్ప మాలధారణ స్వాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు గురుస్వామి గోపగోని రాములుగౌడ్ భిక్షతో ప్రారంభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కౌశిక లత, ఆలయ కమిటీ చైర్మన్ కోలాహలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, ఇల్లందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి ఎమ్మెల్యేను కలిసిన పరకాల ఏసీపీ



ధర్మారం: ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొంది హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బుధవారం పరకాల ఏసీపీ ఎదుల్లా కిషోర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీది ధర్మారం మండలం పత్తిపాక గ్రామం.

మురుగు కాలువలో మిషన్‌భగీరథ పైపు



బిందెలో నీళ్లు పడుతున్న వ్యక్తి

ఓదెల: గ్రామంలో ఎనిమిదో వార్డులో ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువపై మిషన్ భగీరథ పైపులు బిగించడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలోనే బిందెలు పెట్టుకొని మంచినీరు పట్టుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. మంచినీరు కలుషితం కావటంతో అనారోగ్యం పాలవుతున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే భగీరథ పైపులైన్‌ను వేరే ప్రాంతంలో అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.